అగ్రికల్చర్‌లో డ్రెస్ కోడ్!

- మహిళల వస్త్రధారణలో మార్పులు
- వ్యవసాయ రంగంలో కొత్తపుంతలు


చొక్కాలు, పైజామాలు ధరించి సాగు పనుల్లో మహిళా కూలీలు

ఇచ్ఛాపురం రూరల్:

వ్యవసాయ రంగంలో మహిళలదే సింహ భాగం. వరినారు పోసినప్పటి నుంచి నాట్లు వేయడం, కలుపు తీయడం, కోత కోయడం, నూర్పులు చేయడం..ఇలా అన్నింటా ఆమె భాగస్వామ్యం అమోఘం. ఉపాధి హామీ పథకం పనుల్లో సైతం వీరే కీలకం. ఐదేళ్ల క్రితం వరకు సంప్రదాయ చీరకట్టు, ఎండకు, వానకు రక్షణ కల్పించే వెదురుతో తయారు చేసిన తేలిక పాటి గిడుగును శిరస్సుకు ధరించి పొలం పనుల్లో నిమగ్నమయ్యేవారు. అయితే వ్యవసాయ పనులు చేసే సమయంలో చీరకట్టుతో సాఫీగా చేసేందుకు వారికి కొన్ని చిక్కులు ఎదురౌతున్నాయి. వాటిని అధిగమించడానికి సరికొత్తగా ఆలోచన చేస్తున్నారు. తమకు అనుకూలమైన, పనులకు అనువుగా ఉండే దుస్తులు వినియోగిస్తున్నారు. ఇందుకోసం పిల్లల పాత చొక్కాలు, పైజామాలు ధరిస్తూ వ్యవసాయ పనులు చకచకా చేస్తున్నారు. పాతవి లేకుంటే తమకు నచ్చిన తీరులో, సులభంగా పనులు చేసేందుకు వీలుగా ఉండే కొత్త చొక్కాలు కొనుగోలు చేస్తున్నారు.

వ్యవసాయంలో మహిళలే కీలకం

సాంకేతికత అందుబాటులోకి వచ్చినప్పటికీ వ్యవసాయ రంగంలో మహిళలకు పని తగ్గలేదు. వరి నాట్లు వేయడం, కోతల సమయంలో బురదలో పనిచేయాల్సి ఉంటుంది. దీంతో చీరకట్టుతో మహిళలు పనిచేయడానికి ఇబ్బందిగా ఉంటోంది. కలుపు తీసే సమయంలో మట్టి, మొక్కల పసరు, బురద అంటుకుని చీరలు పాడవుతుంటాయి. దీంతో వ్యవసాయ పనుల్లో పనిచేస్తున్న మహిళలు సంప్రదాయ చీరకట్టులో ఎదురవుతున్న అవస్థలను దూరం చేయడానికి డ్రెస్ కోడ్ వైపు దృష్టి సారిస్తున్నారు. ఇదే మాదిరి ఉపాధి హామీ పనులు చేసే సమయంలో మహిళలు డ్రెస్‌కోడ్‌ను పాటిస్తున్నారు.

సౌకర్యవంతంగా ఉంటోంది



చీరకట్టుకొని వ్యవసాయ పనులు చేస్తున్న సమయంలో కొన్ని ఇబ్బందులు తప్పడం లేదు. నాట్లు వేసే సమయంలో ఒళ్లంతా బురదమయమవుతోంది. అదే విధంగా వరికోతలు సమయంలో చేను రవిలి(పుప్పొడి) తగిలి చేతికి, కాళ్లకు గాయాలు, గీతలు ఏర్పడుతుంటాయి. వీటి నుంచి రక్షించుకునేందుకు మోచేతి వరకు షర్టు, కాళ్ల వరకు పైజామా ధరిస్తుంటాం. దీంతో పనులకు సౌకర్యవంతంగా ఉంటోంది.

– మురపాల లక్ష్మమ్మ, వ్యవసాయ కూలి, ఇచ్ఛాపురం

సాగు పనుల్లో సౌలభ్యం



వ్యవసాయ, ఉపాధి హామీ పనుల్లో కూలీలకు సౌలభ్యంగా ఉండేందుకు మహిళా రైతులు, కూలీలు షర్టులు, పైజామాలు ధరిస్తున్నారు. నిజానికి పనుల్లో ఇబ్బందులు తలెత్తకుండా ఈ డ్రెస్‌లు పనికొస్తున్నాయి. ఈ రంగంలో ఆధునికత, సాంకేతికత చోటు చేసుకున్నట్లే.. సాగు పనుల్లో సౌలభ్యం కోసం దుస్తుల్లో మార్పు అనివార్యమే.

– పి.పి.వి.వి.అజయ్‌కుమార్, సీనియర్ వ్యవసాయాధికారి, ఇచ్ఛాపురం

మాజీ సీఎం జగన్‌ను కలిసిన తిలక్



టెక్కలి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టెక్కలి నియోజకవర్గ ఇన్‌చార్జి పేరాడ తిలక్ మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ మేరకు తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో కలిసి నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలను జగన్‌కు వివరించారు. పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు మద్దతుగా ఇటీవల చేపట్టిన కార్యక్రమాలపై చర్చించినట్లు తిలక్ చెప్పారు. పోలీస్, ఇతర అధికారులను అడ్డం పెట్టుకుని వైఎస్సార్ సీపీ కార్యకర్తలపై కూటమి సర్కార్ చేస్తున్న కక్షసాధింపు చర్యలను అధినేత దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. మూలపేట పోర్టు నిర్వాసితులు, పునరావాస కాలనీ సమస్యలను జగన్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలోపేతం కోసం అధినేత పలు సూచనలు చేశారన్నారు.

సాంకేతికతపై పట్టు సాధించాలి



సాఫ్ట్‌వేర్ రంగంలో మారుతున్న పరిణామాలకు అనుగుణంగా విద్యార్థులు మరింతపట్టు సాధించాలని టెక్కలి ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు సూచించారు. కళాశాలలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు కంప్యూటర్ కోడింగ్‌పై మంగళవారం పోటీ పరీక్షలు నిర్వహించారు. కంపైల్ కాంక్యూర్–సీ చాలెంజ్ అనే అంశంపై నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, అధ్యాపకులు రమేష్, చలపతిరావు పాల్గొన్నారు. –టెక్కలి

విద్యార్థులకు పోటీలు



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల విద్యార్థులకు నియోజకవర్గ స్థాయిలో వివిధ పోటీలను మంగళవారం నిర్వహించారు. ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ వి.శంకర్‌రావు పర్యవేక్షణలో వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించగా 157 మంది విద్యార్థులు పాల్గొన్నారు. పోటీల్లో మొదటి మూడుస్థానాల్లో నిలిచిన వారికి జిల్లాస్థాయి పోటీలకు పంపించనున్నట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు. ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శరత్‌బాబు పాల్గొన్నారు. –ఇచ్ఛాపురం

క్లుప్తంగా

సోంపేటలో వరుణయాగం


యాగాన్ని నిర్వహిస్తున్న రుత్వికులు

సోంపేట: సోంపేట పట్టణంలోని సోమేశ్వర స్వామి దేవాలయం ఆవరణలో వరుణ యాగాన్ని మంగళవారం నిర్వహించారు. రుత్వికులు స్వామికి అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేద మంత్రాలతో యాగాన్ని చేపట్టారు. సుమారు నెల రోజులుగా వర్షాల్లేక వరినారు మడులు ఎండిపోతున్నాయి. అలాగే వ్యవసాయపనులు ముందుకు సాగడంలేదు. ఈ నేపథ్యంలో వర్షాలు కురవాలని ఆకాంక్షిస్తూ వరుణ యాగాన్ని నిర్వహించారు. సోంపేట పరిసర గ్రామాలకు చెందిన భక్తులు యాగంలో పాల్గొన్నారు.

ఈక్రాప్ నమోదు తప్పనిసరి

నందిగాం: ఖరీఫ్‌లో పంటలను సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈక్రాప్ నమోదు చేయంచుకోవాలని మండల వ్యవసాయాధికారి శ్రీకాంత్‌వర్మ సూచించారు. పెంటూరు గ్రామంలో 'పొలం పిలుస్తోంది'కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పంటపొలాలను పరిశీలించారు. అన్నదాత సుఖీభవ పథకం క్రింద డబ్బులు పడని రైతులు వీఏఏల వద్ద గ్రీవెన్స్ నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో బీఏఏ అరవింద్, పలువురు రైతులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి


మాట్లాడుతున్న సీఐ మంగరాజు


సోంపేట: కళాశాల విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సీఐ బి.మంగరాజు అన్నారు. సోంపేట పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్మీడియెట్ విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. మత్తు పదార్థాల వలన కలుగు అనర్థాలు వివరించారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్సై వి.లోవరాజు, పోలీసు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా


ధర్నా చేస్తున్న యూనియన్ ప్రతినిధులు

టెక్కలి: ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఏపీ ఎన్‌జీవో, ఏపీపీటీడీ ఎన్ఎంయూ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక డిపో ఎదుట ధర్నా నిర్వహించారు. పీఆర్‌సీ కమిషన్ ఏర్పాటు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, ఆర్టీసీ ఆస్తులను ప్రైవేట్ సంస్థలకు దారాదత్తం చేసుకునే జీవోలను రద్దు చేయాలని, విశాఖ స్టీల్ ప్లాంట్ డిపో తరలింపు ఆపాలని, ఉద్యోగ విరమణ పొందిన వారికి గ్రాట్యుటీ, టెర్మినల్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లింపులు చేయాలని కోరారు. అలాగే ఖాళీలను భర్తీ చేయాలని, పదోన్నతులు కల్పించాలని, మహిళా ఉద్యోగులకు పిల్లల సంరక్షణ సెలవులు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు టి.ఆర్.మూర్తి, పి.వి.కె.రాజు, జి.కె.రావ్, ఎం.ఎస్.చలం, రమేష్ పాల్గొన్నారు.

చింతామణి అమ్మవారికి పూజలు


పూజలందుకున్న చింతామణి అమ్మవారు

కవిటి: శ్రావణ మంగళవారాన్ని పురస్కరించుకుని కవిటిలోని చింతామణి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆంధ్ర, తెలంగాణ, ఒడిశా రాష్ట్రాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారికి సామూహిక లలితాసహస్రనామార్చన కుంకుమార్చనలు, విశేష పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు.

శక్తి యాప్‌పై అవగాహన

నందిగాం: మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్‌ను ప్రతి బాలిక, మహిళ తమ ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకోవాలని టెక్కలి డివిజన్ శక్తి ఇన్‌చార్జి గిరిధర్ కోరారు. కాపుతెంబూరు ఉన్నత పాఠశాలలో శక్తి యాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. శక్తి యాప్ ఉపయోగించే విధానం, దానివలన మహిళలకు, బాలికలకు కలిగే భద్రత గురించి వివరించారు. ప్రధానోపాధ్యాయులు పోలాకి జానకీరామయ్య, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై దాడి పిరికిపంద చర్య

- ఎమ్మెల్సీ నర్తు రామారావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

కవిటి: యాదవ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై టీడీపీ వర్గీయులు చేసిన దాడిని బీసీ జాతిపై జరిగిన దాడిగా వెనుకబడిన కులాలకు చెందిన ప్రతి ఒక్కరూ భావించాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు అన్నారు. కొత్తపుట్టుగలోని తన కార్యాలయంలో యాదవ సామాజిక వర్గ ప్రతినిధులతో కలిసి మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్షులు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, పార్టీ నాయకులు వేల్పుల రాముపై టీడీపీ నాయకులు గూండాల మాదిరిగా చేసిన దాడిని హేయమైన చర్యగా పేర్కొన్నారు. కడప జిల్లాలోని పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు నిర్వహిస్తున్న ఉప ఎన్నిక నేపథ్యంలో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రచారంలో పాల్గొన్న ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌పై కూటమి నాయకులు ఇటీవల చేసిన దాడులను పిరికిపంద చర్యగా అభివర్ణించారు. ఇది బీసీ సామాజిక వర్గానికి చెందిన నాయకులపై జరిగిన దాడి అని, దీనిని జాతి యావత్తు ఖండిస్తుందన్నారు. అధికారంలో ఉంటూ ఓటమి చెందుతున్నారనే ఆవేదనతో ఈవిధమైన భౌతిక దాడులకు పాల్పడ్డారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రతిపక్ష నాయకులను టార్గెట్ చేస్తూ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని ఆరోపించారు. రెండు జెడ్పీటీసీ ఉప ఎన్నికలలో వైఎస్సార్‌సీపీ విజయకేతనాన్ని ఎగరవేసి టీడీపీ పతనానికి నాంది పలుకుతోందని జోస్యం చెప్పారు. కూటమికి ఓటమి భయం పట్టుకోవడంతోనే బుధవారం జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలు ప్రజాస్వామ్య పద్ధతిలో కాకుండా, అరాచక పద్ధతిలో గెలవాలనే ఉద్దేశంతో గొడవలు సృష్టించారన్నారు. సూపర్‌సిక్స్ హామీలు అమలు చేయలేక ప్రజల నుంచి వస్తున్న తీవ్ర వ్యతిరేకతను పక్కదారి పట్టించడానికి ఏదో ఒక అంశాన్ని తెరపైకి తీసుకువచ్చి డైవర్షన్ పాలిటిక్స్ నెరుపుతున్నారు. కృష్ణా జెడ్పీ చైర్‌పర్సన్ హారిక దంపతులపై, అలాగే ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్‌పై చేసిన దాడులు కూటమి సర్కార్ ఆందోళనకు నిదర్శనమన్నారు.

ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



పలాస: ర్యాలీలో విద్యార్థులు, కళాశాల సిబ్బంది



కవిటిలో తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

పలాస: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ అధికారి పి.మధు నేతృత్వంలో మంగళవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఉత్సాహంగా నిర్వహించారు. కళాశాల పొంగణం నుంచి పలాస ఇందిరగాంధీ బొమ్మ కూడలి వరకు ర్యాలీ చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది ర్యాలీలో భాగస్వాములై దేశభక్తిని చాటి చెప్పారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ జె.వెంకటలక్ష్మి మాట్లాడుతూ.. ఈ ర్యాలీ ద్వారా ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాకాన్ని ఎగురు వేయాలని, తద్వారా దేశ స్వాతంత్ర్యానికి గల ప్రాధాన్యతను ప్రజలకు వివరించాలని చెప్పారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎన్.గణపతిరావు, ఐక్యూ ఏసీ కోఆర్డినేటరు పి.వెంకటరమణ, శ్రీనివాస్ పట్నాయక్ పాల్గొన్నారు.

కవిటి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల సిబ్బంది, విద్యార్థులు హర్‌ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించారు. ప్రతీ ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలని విద్యార్థులు నినాదాలు చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.సింహాచలం పాల్గొన్నారు.

నులిపురుగులను నులిమేద్దాం


టెక్కలి బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులకు ఆల్బెండజోల్ మాత్రలను అందజేస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ మేరీ కాథరిన్


ఇచ్ఛాపురం రూరల్: హరిపురంలో చిన్నారులకు మాత్రలు వేస్తున్న ఐసీడీఎస్ సీడీపీవో రాజేశ్వరి


కవిటి: మాణిక్యపురం పాఠశాలలో బాలికకు మాత్రలు వేస్తున్న డాక్టర్ ధనలక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి


ఇచ్ఛాపురం: పంజావీధి ప్రాథమిక పాఠశాలలో మాత్రలను అందజేస్తున్న వైద్య సిబ్బంది


కంచిలి పాఠశాలలో విద్యార్థులతో మాత్రలను మింగిస్తున్న పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ టి.హరిబాబు

పిల్లల ఆరోగ్యానికి కీడు చేసే నులిపురుగుల నిర్మూలనపై అందరూ దృష్టిసారించాలని అధికారులు, వైద్యసిబ్బంది కోరారు. పిల్లల ఆరోగ్యాన్ని హరించే నులిపురుగుల బారినుంచి వారిని రక్షించాలన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలను మంగళవారం పంపిణీ చేశారు. పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు వైద్య సిబ్బంది వెళ్లి మాత్రలను పంపిణీ చేయడంతోపాటు వారి సమక్షంలోనే మింగించారు.

–సాక్షి నెట్‌వర్క్

రంగనాథన్‌కు ఘన నివాళులు

నందిగాం: గ్రంథాలయాలకు విశేష సేవలు అందించిన ఎస్.ఆర్.రంగనాథన్ 132వ జయంతి కార్యక్రమాన్ని స్థానిక శాఖాగ్రంథాలయంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రంగనాథన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రంథాలయాధికారి ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ.. మన దేశంలో గ్రంథాలయోద్యమంలో రంగనాథన్ ప్రముఖ పాత్ర పోషించారని గుర్తు చేశారు. అందుకుగాను ఆయన పుట్టిన రోజైన ఆగస్టు 12వ తేదీని జాతీయ గ్రంథాలయాధికారుల దినోత్సవంగా జరుపుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో పలువురు పాఠకులు పాల్గొన్నారు.

సంతబొమ్మాళి: సంతబొమ్మాళి శాఖా గ్రంథాలయంలో నేషనల్ లైబ్రేరియన్స్ డే సందర్భంగా గ్రంథాలయ పితామహుడు డాక్టర్ ఎస్సార్ రంగనాథన్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి కె.రామకష్ణ పూలమాల వేసి నివాళులర్పించారు. పాఠకులు నారాయణ, చందు, శ్రీధర్, రమేష్, తేజ పాల్గొన్నారు.

తూనికల్లో తేడాలొస్తే చర్యలు


కిరాణా దుకాణంలో తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ కమిషనర్ చిన్నమ్మ

పలాస: తూనికల్లో తేడాలు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తూనికలు కొలతలు శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ పి.చిన్నమ్మ హెచ్చరించారు. పలాస–కాశీబుగ్గ జంట పట్టణాల్లో వివిధ దుకాణాలను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పలాస–కాశీబుగ్గ నుంచి ఇటీవల ఎక్కువ ఫిర్యాదులు అందుతున్నాయని, దీన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందన్నారు. అందుకే ఈ ఆకస్మిక తనిఖీలు అని చెప్పారు. చేపల దుకాణంలో మూడు కేసులు నమోదు చేయగా రెండు చికెన్ షాపులు, ఆరు కిరాణా షాపులు, ఒక ఫర్నీచర్ షాపు తనిఖీ చేయగా తూకంలో తేడాలు రావడంతో 14 కేసులు నమోదు చేశామన్నారు. తనిఖీల్లో పలాస ఇన్‌చార్జి ఎ.బలరామక్రిష్ణ ఉన్నారు.

ఎఫ్‌ఏ–1 పరీక్షల పరిశీలన


పరీక్ష పుస్తకాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో అప్పారావు

ఇచ్ఛాపురం రూరల్: ఎఫ్‌ఏ–1 పరీక్షలను ఉపాధ్యాయులు పగడ్బందీగా నిర్వహించాలని ఎంఈవో కురమాన అప్పారావు అన్నారు. లొద్దపుట్టి ప్రాథమిక పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను మంగళవారం పరిశీలించారు. ఈ విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులు ఏడాదిలో అన్ని పరీక్షల సమాధానాలు ఒకే పుస్తకంలో రాసేలా అసైన్‌మెంట్ పుస్తకాలు ఇవ్వడం జరిగిందన్నారు. విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షలు రాసేలా వారికి అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పథకాన్ని పరిశీలించారు.

హెచ్ఐవీపై అప్రమత్తంగా ఉండాలి

టెక్కలి: హెచ్ఐవీపై అప్రమత్తంగా ఉండాలని టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ సూచించారు. అంతర్జాతీయ యువత దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రి ఐసీటీసీ ఆధ్వర్యంలో మంగళవారం కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్ఐవీ వ్యాప్తి, వాటి నివారణపై చైతన్యం కల్పించారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ నేతాజీ, వైసీబీపీయూ ట్రక్కర్ ప్రాజెక్టు ప్రతినిధి మాధవరావు, హెల్త్ ఎడ్యుకేటర్ హరినాథ్‌రెడ్డి, హేమలత పాల్గొన్నారు.

విద్యార్థుల జీవితాలతో ఆటలా?


మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

మందస: పట్టులోగాం గిరిజన సంక్షేమ వసతి గృహంలో జరుగుతున్న పరిణామాలకు జిల్లా అధికారుల వైఫల్యమే కారణమని గిరిజన సంఘం జిల్లా నాయకులు సవర ఫల్గుణరావు, సవర ధర్మారావు అన్నారు. మంగళవారం గిరిజన సంఘం సభ్యులతో హాస్టల్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల పట్ల అనుచితంగా వ్యవహరించిన ముగ్గురు టీచర్లను బదిలీ చేయాలని కోరితే వారిని కాకుండా వేరొకరిని బదిలీ చేశారని, దీంతో సమస్య పరిష్కారం కాదని భావించి విద్యార్థులు హాస్టల్ ఖాళీ చేసి వెళ్లిపోయారని చెప్పారు. సమస్యలపై పరిశీలనకు వచ్చిన డీడీ అన్నదొర, ఏటీడబ్ల్యూవో మల్లికార్జునలు విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడం సరికాదన్నారు. కార్యక్రమంలో స్కూల్ కమిటీ చైర్మన్ సవర లక్ష్మీనారాయణ, సవర నాగేశ్వరరావు, నర్సింగులు, ఎస్.బలరాం, ఎస్.జగన్, రవి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

టెక్కలి రూరల్: స్థానిక తెంబూర్ రోడ్డులో మంగళవారం మధ్యాహ్నం ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఓ ప్రైవేట్ బస్సు కారణంగా ఈ సమస్య ఉత్పన్నమైంది. శ్రీకాకుళం నుంచి పలాస వైపు వెళ్తున్న బస్సు టాప్‌పై అధికంగా లగేజీ లోడ్ చేసి ఉంది. బస్సు రైల్వే గేటు దాటుతున్న సమయంలో రైల్వే విద్యుత్ తీగలకు తగల కుండా కొంత దూరంలో ఏర్పాటు చేసిన ఐరన్ ఫ్లేమ్‌కు బస్సుపై ఉన్న లగేజీ తగిలింది. దీన్ని గుర్తించిన డ్రైవర్ బస్సును నిలిపివేయడంతో వాహనాలు వెళ్లేందుకు మార్గం లేక ట్రాఫిక్ స్తంభించింది. డ్రైవర్ అప్రమత్తమై బస్సును వెనక్కి మళ్లించి మరో మార్గంలో వెళ్లిపోవడంతో సమస్య పరిష్కారమైంది.

టి.బరంపురంలో ఆధ్యాత్మిక ప్రవచనాలు


ప్రవచనం చేస్తున్న దాలిరాజు

ఇచ్ఛాపురం రూరల్: తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో టి.బరంపురం గ్రామంలో ఆధ్యాత్మిక ప్రవచనాల కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. స్థానిక సీతారాముల ఆలయం ప్రాంగణంలో టీడీడీ ఆధ్యాత్మిక ప్రవచనాకర్త కె.దాలిరాజు రామాయణం పారాయణం చేశారు. ఈనెల 16వ తేదీ వరకు ఐదు రోజుల పాటు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ఉపన్యాసాలు, కుంకుమ పూజలు జరుగుతాయని దాలిరాజు తెలిపారు. కార్యక్రమంలో తిప్పన ధనుంజయరెడ్డి, తిప్పన తమ్మయ్య రెడ్డి, ఆర్థికట్ల బాలకృష్ణ, గణేష్, కేధారి, లింగయ్య, ఉమాపతి, వాసులు పాల్గొన్నారు.